రేషన్ తెచ్చుకోవాలంటే 2.5 కి.మీ.వెళ్లాల్సిందే..!

- కూటమి నిర్ణయంతో రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం వాసులకు కష్టాలు
- రేషన్ సరకులు కోసం దారపాలెం వెళ్లాల్సిన పరిస్థితి
- తడిసిమోపెడవుతున్న రవాణా ఖర్చులు


డిపో దూరం కావడంతో రేషన్ సరకులకు వెళ్లలేదంటున్న రామకృష్ణాపురం మహిళలు


దారపాలెంలో 224 నంబర్ రేషన్ డిపో క్యూ


రామకృష్ణాపురం నుంచి రేషన్ సరకులు కోసం ఆటోలో డిపోనకు వచ్చిన మహిళ

ఆరిలోవ: రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం గ్రామాలకు చెందిన ప్రజలు రేషన్ సరుకుల కోసం రెండు కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న దారంపాలెం రేషన్ డిపోనకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో జగన్ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఇంటి వద్దే రేషన్ సరుకులను అందజేయగా, ఇప్పుడు మళ్లీ దూర ప్రాంతాలకు వెళ్లి సరుకులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు వాపోతున్నారు.'ఇంతవరకు రేషన్ బండి మా ఇంటివరకు వచ్చేది. జగన్ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు ఇంటి వద్దే సరుకులు తీసుకొనేవాళ్లం. ఇప్పుడు మళ్లీ దూరంగా దారంపాలెంలో ఉన్న రేషన్ డిపోకి వెళ్లాల్సి వస్తుందని రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం వాసులు తెలిపారు. మాకు మళ్లీ తిప్పలు మొదలయ్యాయంటూ తలలు పట్టుకొంటున్నారు.

దారంపాలెం డిపో పరిధిలో ఐదు గ్రామాలు

తూర్పు నియోజకవర్గంలోని 13వ వార్డులో మొత్తం ఐదు రేషన్ డిపోలున్నాయి. వీటిలో ఆరిలోవ కాలనీలో మూడు, శ్రీకాంత్‌నగర్‌లో ఒకటి, దారంపాలెంలో మరొకటి ఉన్నాయి. దారంపాలెం డిపో పరిధిలో దారంపాలెం, అర కిలోమీటరు దూరంలో పైనాపిల్ కాలనీ, ఒకటిన్నర కిలోమీటర్లు దూరంలో ఎస్ఎస్ఎన్ నగర్, రెండు కిలోమీటర్లు దూరంలో శ్రీకృష్ణాపురం, రెండున్నర కిలోమీటర్లకు పైగా దూరంలో రామకృష్ణాపురం గ్రామాలు ఉన్నాయి. ఈ ఐదు గ్రామాలలో సుమారు 1,300 రేషన్ కార్డు దారులు ఉన్నారు. వీరందరికీ దారంపాలెం రేషన్ డిపో మాత్రమే అందుబాటులో ఉంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో మేలు

ప్రారంభంలో తక్కువ కార్డులు ఉండటం వల్ల అధికారుల దారంపాలెంలో రేషన్ డిపోను ఏర్పాటు చేశారు. 2019 వరకు రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం ప్రజలు రెండున్నర కిలోమీటర్లు పైగా ఆటోలలో వెళ్లి రేషన్ సరుకులు తీసుకురావడానికి ఇబ్బందులు పడేవారు. అయితే, 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారికి ఇంటి వద్దకే రేషన్ సరుకుల వాహనం వచ్చేది. దీంతో సుమారు ఐదేళ్లు వారికి ఈ సమస్య లేకుండా పోయింది.


బియ్యం మోసుకుంటూ మహిళలు ఆపసోపాలు

కూటమి ప్రభుత్వంతో మళ్లీ మొదలైన కష్టాలు

తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ నెల నుంచి మళ్లీ పాత సమస్య తలెత్తింది. కిలోమీటర్ల దూరంలో ఉన్న రేషన్ డిపోనకు ఆటోలలో వెళ్లాల్సిన పరిస్థితి మళ్లీ వచ్చిందని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. ఆటోలలో వెళ్లి రావడానికి మనిషికి రూ.20 ఖర్చు అవుతుందని, జనం ఎక్కువగా ఉంటే రెండోసారి కూడా వెళ్లాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి మళ్లీ రేషన్ బండి రావాలని, లేదంటే తమకు దగ్గరలో రేషన్ డిపో పెట్టాలని రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.


సెంట్రల్ జైల్ ఎదురుగా ఉన్న రామకృష్ణాపురం

సమస్య మళ్లీ మొదటికే వచ్చింది



దారంపాలెంలో ఉన్న రేషన్ డిపోనకు రెండున్నర కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుండటంపై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గతంలో ఎదుర్కొన్న సమస్యే మళ్లీ వచ్చింది. రేషన్ కోసం దారంపాలెం వెళ్లడానికి గతంలో ఇబ్బంది పడేవాళ్లం. వైఎస్ జగన్ ప్రభుత్వంలో మా గ్రామానికే బండి వచ్చేది. వీధిలో ఇంటిముందే ఐదు నిమిషాలలో బియ్యం ఇచ్చేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారింది. ఇప్పుడు రెండు పక్కలా రూ.20 ఆటోలకు చార్జీలు ఇచ్చి వెళ్లాలి. అక్కడ డిపో వద్ద క్యూ లైన్ ఎక్కువగా ఉంటే తిరిగి ఇంటికి వచ్చేయాలి. మళ్లీ వెళ్లాలంటే మరోసారి ఆటో చార్జీలు అవుతాయి. ఇచ్చిన బియ్యానికి ఆటో చార్జీలకే ఖర్చయితే ఎలా?

–ఎం.లక్ష్మి, రామకృష్ణాపురం,

అంత దూరం ఎలా వెళ్లగలను



ఇంతవరకు ఇంటి వద్దకే వ్యాను వచ్చేది.దర్జాగా బియ్యం తీసుకొనేదాన్ని. నాకు 60 దేళ్లు.. నాకు ఐదు కేజీల బియ్యం ఇస్తారు. ఆ బియ్యం కోసం ఇప్పుడు దారపాలెంలో రేషన్ డిపోనకు రూ.20 ఖర్చు పెట్టి వెళ్లాలి. ఇంత వయసులో నేను ఎలా వెళ్లగలను. బియ్యం ఇంటి వరకు అందించాలి. –పెందుర్తి దాలమ్మ, రామకృష్ణాపురం

ఆటో చార్జీల భారం



దారపాలెం దూరం కావడంతో ఆటోలో వెళ్లి రేషన్ బియ్యం తీసుకువచ్చా. దూరం కావడంతో మహిళలంతా ఒంటిరిగా వెళ్లలేం. కనీసం మరొకరైనా తోడుగా ఉండాల్సిందే. ఇద్దరు, ముగ్గురం కలసి దారపాలెంలో రేషన్ కోసం ఆటోలలో వెళ్లాల్సి వస్తోంది. ఇదివరకు మా గ్రామంలోకి రేషన్ బండి వస్తే బియ్యం తీసుకొనేవాళ్లం. ఇప్పుడు దూరంగా ఉన్న దారపాలెం వెళ్లడానికి ఇబ్బందిగా ఉంది.

–సీహెచ్.మంగ, రామకృష్ణాపురం,

క్లుప్తంగా

జోడుగుళ్లపాలెం బీచ్ శుభ్రం


జోడుగుళ్లపాలెం బీచ్‌లో శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఆరిలోవ: జూన్ 21న ప్రభుత్వం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలోని పార్కులు, బీచ్ ప్రదేశాలను శుభ్రం చేస్తున్నారు. మంగళవారం జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధిలోని జోడుగుళ్లపాలెం బీచ్ వద్ద పారిశుధ్య కార్మికులు ప్రత్యేకంగా శుభ్రతా కార్యక్రమం చేపట్టారు. వాలీబాల్ గ్రౌండ్, అమ్మవారి ఆలయ ఆవరణంలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, ఆకులు, పర్యాటకులు వేసిన చెత్తను సేకరించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. యోగా దినోత్సవానికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడంలో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నారు.

గోల్డ్ మెడల్ ఏర్పాటుకు విరాళం


చెక్కు అందజేస్తున్న దాతలు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం నావెల్ ఆర్కిటెక్చర్ విభాగంలో విద్యార్థులను ప్రోత్సహిం చేందుకు టెక్నాలజీ అసోసియేట్స్ (టీఏఐ) ఇంజినీర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ. 10.50 లక్షల భారీ విరాళాన్ని అందించింది. ఈ విరాళంలో భాగంగా, రాజ్–టీఏఐ గోల్డ్ మెడల్ ఏర్పాటు చేయడానికి రూ. 3 లక్షలు, అలాగే శిరి అండ్ అనిల్ రాజ్ ఎండోమెంట్ స్కాలర్‌షిప్ ఏర్పాటు చేయడానికి రూ.7.50 లక్షలు అందజేశారు. విరాళానికి సంబంధించిన చెక్కును టీఏఐ ఇంజినీర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ జానకి రామన్ గణేశన్ మంగళవారం ఏయూ ఉపకులపతి ఆచార్య రాజశేఖర్ సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావుకు అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ విధంగా సహకరిస్తున్న దాతలు అభినందనీయులని వీసీ, రిజిస్ట్రార్ అన్నారు. ఈ విరాళం నావెల్ ఆర్కిటెక్చర్ విభాగం విద్యార్థుల ఉన్నత విద్యకు, వారి భవిష్యత్తుకు ఎంతగానో తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అధికారులతో మాల కార్పొరేషన్ చైర్మన్ భేటి


విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న అధికారులు

ఎంవీపీకాలనీ: రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్ మంగళవారం విశాఖ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఎంవీపీ కాలనీలోని కార్పొరేషన్ కార్యాలయంలో మధ్యాహ్నం జరిగిన ఈ సమావేశంలో జిల్లాలోని ఎస్సీ కార్పొరేషన్ ఉన్నతాధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా లబ్ధిదారులకు అందిస్తున్న వివిధ సేవలు, రుణాలు, కొత్త ప్రాజెక్టుల పురోగతిపై విజయకుమార్ ఆరా తీశారు. ప్రస్తుతం నోటిఫికేషన్ల ద్వారా వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశానంతరం, కార్పొరేషన్ ఉద్యోగులు విజయకుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ తదితరులు పాల్గొన్నారు.

అడ్వాన్స్‌డ్‌లో శ్రీరామానుజ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శివ రామ దత్తాత్రేయ

బీచ్‌రోడ్డు: సోమవారం విడుదలైన ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో పెదవాల్తేరులోని శ్రీరామానుజ జూనియర్ కాలేజ్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారని ఆ కాలేజ్ ప్రిన్సిపాల్ శివ రామ దత్తాత్రేయ తెలిపారు. ఈ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన ముగ్గురు విద్యార్థులను మంగళవారం కళాశాల యాజమాన్యం అభినందించింది.

ప్రజల భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: ప్రజలందరి భాగస్వామ్యంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ అన్నారు. గురువారం ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే పర్యావరణ దినోత్సవ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ హితంగా మన జీవన విధానాన్ని మార్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఉపాధ్యాయులుగా మారే బీఈడీ, ఎంఈడీ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. తద్వారా పాఠశాల స్థాయి నుంచే చిన్నారులలో పర్యావరణ స్పృహను పెంపొందించి, సంరక్షించే బాధ్యతను వారికి అందించడం జరుగుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ద్వారా మాత్రమే మానవ మనుగడ సాధ్యపడుతుందనే విషయాన్ని ప్రజలు అర్థం చేసుకొని తదనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. విద్యా విభాగాధిపతి ఆచార్య టి. షారోన్ రాజు మాట్లాడుతూ పర్యావరణాన్ని సంరక్షించడం, భవిష్యత్ తరాలకు అందించడం మనందరి బాధ్యత అని చెప్పారు. ముఖ్యంగా ఉపాధ్యాయులుగా మారే విద్యార్థులకు ఈ దిశగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం తమ విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విభాగాచార్యులు ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ ప్రవీణా దేవి, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.

పలు కోర్సులలో ఉచిత శిక్షణ

తాటిచెట్లపాలెం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధి కార్యాలయం, మోడల్ కెరీర్ సెంటర్‌లు యువతకు ఉచితంగా సాఫ్ట్‌వేర్ శిక్షణను అందిస్తున్నాయి. 18 నుంచి 30 ఏళ్ల వయస్సు గల ఇంటర్, డిగ్రీ, డిప్లమో పూర్తి చేసిన యువతీ యువకులకు జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, వెబ్ డెవలపర్ కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ అనంతరం ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు కంచరపాలెం నందు గల ఉపాధి కార్యాలయంలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం పి. నరసింహారావు (79015 23209), ఎం. నాగ త్రినాథ్ (98855 07887) నంబర్లలో సంప్రదించవచ్చు.

'వెన్నుపోటు దినం' విజయవంతం చేయండి


నియోజకవర్గ నేతలతో మాట్లాడుతున్న నాగార్జున యాదవ్

సాక్షి, విశాఖపట్నం: బుధవారం నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన కార్యాచరణపై జిల్లాలోని వివిధ నియోజకవర్గాల సమన్వయకర్తలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీ సభ్యులతో ఆయన సమావేశమై దిశానిర్దేశం చేశారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకే జిల్లాలో 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేయడానికి తాను వచ్చానని నాగార్జున యాదవ్ తెలిపారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో యనమల నాగార్జున యాదవ్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వలంటీర్ విభాగ జిల్లా అధ్యక్షుడు పీలా ప్రేమ్ కిరణ్, విద్యార్థి విభాగ అధ్యక్షులు కొండా రెడ్డి, భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలకు అడ్డుకట్ట


నూతనంగా ఏర్పాటు చేస్తున్న గడ్డర్లు

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులో తరచూ జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు జీవీఎంసీ కీలక చర్యలు చేపట్టింది. భారీ వాహనాలు, లారీలు ప్రవేశించకుండా అడ్డుకట్ట వేసేలా పలు మార్గాల్లో బారికేడ్‌లను ఏర్పాటు చేస్తోంది. జిల్లా పరిషత్ కూడలి నుంచి నోవాటెల్ మీదుగా రామకృష్ణా బీచ్‌కు వెళ్లే మార్గంతో పాటు, సెంచరీ క్లబ్‌కు వెళ్లే మార్గంలోనూ ఈ బారికేడ్ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే పందిమెట్ట నుంచి బీచ్ రోడ్డుకు వెళ్లే మార్గంలో ఇటువంటి ఏర్పాట్లు చేశారు. గతంలో ఓ లారీ అదుపుతప్పి బీచ్ రోడ్డులోకి దూసుకువచ్చి పలువురి మృతికి కారణమైంది. ఇటీవల మరో ఇసుక లారీ కూడా అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొట్టింది. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు తీసుకుంటున్నారు. మరో వారం రోజుల్లో ఈ మార్గాల్లో భారీ వాహనాల ప్రవేశం పూర్తిస్థాయిలో నిలిచిపోతుందని అధికారులు తెలిపారు.

కూటమి వైఫల్యాలు నిలదీసేందుకు 'వెన్నుపోటు దినం'

- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు


వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయకర్త అప్పారావును సత్కరిస్తున్న నాయకులు

మద్దిలపాలెం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమై, వారిని వంచించడాన్ని నిలదీసేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తలపెట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి జీవీఎంసీ 17వ వార్డు నుంచి అధిక సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు. మంగళవారం సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో 17వ వార్డు నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరిగింది. పార్టీఈ సీనియర్ నాయకులు నీలారెడ్డి ఆధ్వర్యంలో, వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మొల్లి అప్పారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అప్పారావును గజమాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నిర్వహించే ప్రతి కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యంగా, ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి 17వ వార్డు నుంచి భారీ సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తరలివచ్చేలా చూడాలని సూచించారు.

కార్యకర్తలకు భరోసా

కార్యకర్తలకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని అప్పారావు భరోసా ఇచ్చారు. అందరూ ఒక ఏకాభిప్రాయంతో వార్డు కమిటీలను, బూత్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని, 17వ వార్డులోని అన్ని బూత్‌లకు సభ్యులు ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యకర్తల కష్టానికి తగిన ప్రతిఫలం లభించేలా తాను బాధ్యత తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, శంకర రెడ్డి, మంగరాజు, సత్యవతి, కుమార్ రెడ్డి, శివ, లవణ్ కుమార్, రవి కుమార్ రెడ్డి, రవికిరణ్ రెడ్డి, జీరు రవి కుమార్ రెడ్డి, రమణ రెడ్డి, వెంకట రమణ రెడ్డి, పోలిరెడ్డి, రవికిరణ్, రమేష్, అప్పలరాజు, యనమరెడ్డి కుమార్ రెడ్డి, తరుణ్, రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా అటవీశాఖ భవనం


బీచ్‌రోడ్డులో ఉన్న అటవీశాఖ భవనం


తాళం వేసి ఉన్న ప్రాంగణం

ఏయూక్యాంపస్: నగరంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన బీచ్ మార్గంలో ఉన్న అటవీశాఖ భవనం ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. సముద్ర తాబేళ్ల సంరక్షణ, వాటి ప్రాముఖ్యతపై సందర్శకులు, నగరవాసులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మెరైన్ టర్టిల్ ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్ నిర్లక్ష్యానికి గురైంది. గతంలో ఈ కేంద్రం 'వన దర్శిని' పేరుతో అటవీ సంబంధిత అంశాలపై విజ్ఞానాన్ని అందించేది. కాలక్రమేణా అటవీశాఖ సముద్ర తాబేళ్ల ప్రాముఖ్యతను గుర్తించి, వాటి పై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఆధునీకరించి మెరైన్ టర్టిల్ ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్‌గా మార్చింది. అంతరించిపోతున్న జాబితాలో ఉన్న సముద్ర తాబేళ్లను సంరక్షించడంలో ప్రజలను భాగస్వాములను చేయాలనే ఉన్నత ఆశయంతో ఇది ప్రారంభమైంది. అయితే ప్రస్తుతం ఈ కేంద్రం నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. భవనానికి, గేటుకు తాళం వేసి ఉండటంతో ఇది కేవలం అలంకార ప్రాయంగా మారి, ప్రజలకు ఎటువంటి విజ్ఞానాన్ని అందిం చడం లేదు. అటవీ శాఖ అధికారులు దీనిపై దృష్టి సారించి, ఈ కేంద్రాన్ని తిరిగి తెరిచి, ముఖ్యంగా విద్యార్థులకు సముద్ర తాబేళ్లపై అవగాహన కల్పించే విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పేరుకుపోతున్న చెత్త


ఆస్పత్రులు ఆనుకొని ఉన్న ఫుట్‌పాత్‌లపై పేరుకుపోయిన చెత్త

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డులో పారిశుద్ధ్య నిర్వహణ గాలికొదిలేయడంతో రోడ్లు, ఫుట్‌పాత్‌లు చెత్త కుప్పలుగా మారాయి. వారం రోజులుగా చెత్తను తరలించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతుండడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కరకచెట్టు పోలమాంబ దేవాలయం రోడ్డు, మానసిక ఆస్పత్రి రోడ్డు, చినవాల్తేరు రోడ్డు, పెదవాల్తేరు రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయింది. ప్రతిరోజూ చెత్తను తొలగించాల్సిన పారిశుద్ధ్య కార్మికులు గత వారం రోజులుగా ఈ ప్రాంతంలో కనబడటం లేదు. దీంతో రోడ్లు, ఫుట్‌పాత్‌లు చెత్తతో నిండిపోయి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. చెత్త సమస్యను తక్షణమే పరిష్కరించాలని స్థానికులు జీవీఎంసీ అధికారులను కోరుతున్నారు.

ఆస్పత్రుల వద్ద మరింత దారుణం

ఈ ప్రాంతంలో నాలుగు ప్రభుత్వ ఆస్పత్రులు ఉండటం పరిస్థితిని మరింత దారుణంగా మార్చింది. ఈ రోడ్లన్నీ ఆస్పత్రి ప్రహరీలకు ఆనుకుని ఉంటాయి. ముఖ్యంగా మానసిక ఆస్పత్రి, రాణిచంద్రమతి దేవి ఆస్పత్రుల గోడల పక్కన చెత్త పేరుకుపోవడంతో రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల చెత్త కుళ్లిపోయి దుర్గంధం మరింత పెరిగింది. దీనివల్ల తమ రోగాలు మరింత ఎక్కువవుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే చెత్తను తొలగించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

గోడలపై ఆసనాలు



విశాఖలో ఎటు చూసినా యోగా రంగులే. ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం కోసం నగర గోడలు సరికొత్తగా ముస్తాబవుతున్నాయి. ఈస్ట్ పాయింట్ కాలనీ బీచ్ రోడ్డు గోడల నిండా యోగా ఆసనాల చిత్రాలు, వాటికి కొత్తగా అద్దుతున్న రంగులు చూడముచ్చటగా ఉన్నాయి. ఈ అందమైన దృశ్యాలు చూస్తుంటే, విశాఖ ప్రజలు యోగా దినోత్సవానికి ఎంత ఉత్సాహంగా ఉన్నారో అర్థమవుతుంది.

–ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

విద్యార్థులకు సీపీ గీతాబోధన

దాబాగార్డెన్స్: స్వామి వివేకానంద సంస్థ నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ట్యూషన్ విద్యార్థులకు భగవద్గీత బోధన చేసి, శ్లోకాల అర్థం, తాత్పర్యాన్ని వివరించారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, చెడు మార్గాల వైపు వెళ్లకుండా సివిల్స్ లక్ష్యంగా ఇప్పటి నుంచే సిద్ధం కావాలని సీపీ సూచించారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు, కూచిపూడి నృత్యంలో ప్రతిభ చూపిన వారికి, భగవద్గీత శ్లోకాలు పఠించిన వారికి, సంస్థ మహిళా సభ్యులకు ఆయన బహుమతులు అందజేశారు.